


ఇంకా తూర్పు నిద్రలేవలేదు.

మసక చీకట్లు ప్రకృతితో దోబూచు లాడుతూనే ఉన్నాయి. చుట్టూ కొండలూ, ఆ కొండలపై గడుసు దెయ్యాల్లాంటి గుబురు చెట్లూ, ఆ చెట్ల ఆకుల్లో నిద్రిస్తున్న చీకటి, ఆ చీకట్లో....

గరువునేల దారిలో ఒంటరిగా నడుస్తోన్న రామి మనస్సు అంతకంటే ఎక్కువ చీకటిగా వుంది. ఆమె నిజంగా నడవడం లేదు. నడుస్తున్నాననుకొంటూ పరుగుదీస్తోంది. మనస్సులో ఏదో భయం, వెనకనుంచి ఎవరో వెంటాడుతూన్న ఆపోహ, తెలీని గమ్యాన్ని చేరుకోవాలనే తహతహ. కాళ్లు తడబడుతున్నాయి. నరాల్లో రక్తప్రసరణ జోరు ఎక్కువైంది. వొళ్లంతా స్వేదంతో చికాకుగా వుంది. గర్భగుడిలో గంటలు మోగుతున్నట్టు ఒకటే దడ.

# జంగారెడ్డిగూడెం జంక్షన్‌లో...

## తాళ్లూరు నాగేశ్వరరావు



తనెక్కడికి వెళ్లాలి!

ఎక్కడకు వెళుతోంది!

ఏమో.... ఏమో!

వెనక నుంచి రెండెడ్ల బళ్లు వస్తూన్న చప్పుడు. ఎడ్ల మెడల్లో గంటలు అస్పష్టంగా మోగుతున్నాయి. తనకి ముందు ఏదో బండి పోతూన్నట్టుంది. ఎడ్లను అదిలిస్తూన్న కేకలు. గరువు ఇసుకలో నడవటమూ కష్టమే. బండి లాగడం అంతకంటే కష్టం. తెల్లారితే గురువారం కామోసు. జంగారెడ్డి గూడెంలో సంత. వేగవరం, జిల్లేరు, పాలేరు, ముత్యాలగూడెం, బుట్టాయి గూడెం, గురవాయి గూడెం, చుట్టు పక్కల పల్లెల్లోంచి సంతకోసం జనం ఎగబడి వస్తారు. వాళ్లల్లో గురవాయి గూడెంనుంచి వచ్చేవాళ్లు.... తనని తప్పకుండా గుర్తుపడతారు.

గుర్తుపట్టి....

సంత మొదలు కాకముందే తాను జంగారెడ్డి గూడెం నుంచి తప్పుకోవాలి; ఎక్కడకు! ఏమో....!

శ్రావణ మేఘాలు ఆకాశాన్ని అవరించి, నక్షత్ర కాంతిని భూమికి దూరం చేశాయి. మబ్బులు ఎంత దట్టంగా పట్టాయో, ఏ క్షణాన వర్షించడానికి కాళ్లు దువ్వుతున్నాయో తెల్సుకొనే అవకాశం లేకుండా చీకటి రాజ్యం చేస్తోంది.

రామి గబగబా నడుస్తోంది. కానీ మనస్సు ఎంత వేగంగా పరుగెత్తుతుందో, అంతగా దూరం జరగడంలేదు. అప్పుడప్పుడు వెనక్కు తిరిగి చూస్తోంది—తన కోసం ఎవరైనా పరుగెత్తుకొంటూ వస్తున్నారేమోనని! కాని అలాంటి అనుమానమేమీ రాలేదు. కాళ్లకు చెప్పులున్నాయి. చింతలపూడి అరవయ్యో నంబరు కట్టుడు నేతచీర కుచ్చెళ్లను కాళ్లకు అడ్డం పడకుండా బొడ్లోకి దోపింది. పైటచెంగును నడుంకు బిగించింది—వడిసేల విసురుతూన్న ఫోజులో. కాళ్లు పొడగరి కావడం వల్ల జమాయించి అంగలు వేయగలుగుతోంది. బళ్లదారి తప్పకుండా నడుస్తోంది. ఆ దారి తప్పితే పురుగూపుట్రా వాతపడే ప్రమాదముంది. వానొచ్చినా ఫర్వాలేదు. ఏ చింతచెట్టు చాటునో తలదాచుకోవచ్చు. పురుగు కుట్టితే నేల కర్చుకోవలసిందే! చేసే ప్రయాసంతా బూడిద పాలవుతుంది.... అనుకొంటూ రామి వడివడిగా నడక సాగిస్తోంది.

ఆమె కాళ్లు ఏమాత్రం నొప్పులు పుట్టడంలేదు. ఒకవేళ పుడుతున్నా, ఆ తొందరలో దడదడలో తెలీడం లేదేమో! .... ఇంటికాడ బయల్దేరి ముప్పావుగంటవుతుందేమో! ఇంకెప్పటికి తెల్లారుతుందో! జంగారెడ్డిగూడెం పొలిమేరలు ఎప్పటికొస్తాయో! జొన్నచేలు రావాలి. ఆ తర్వాత పొగాకు మళ్లు, ఆ పైన చెరుకుతోటలు.... అవి దాటితే గవర్నమెంటోరు కోయదొరలకు కట్టించిన కాలనీ ఇళ్లు. అవి దాటితే జంగారెడ్డి గూడెంలోకి వచ్చిపడ్డట్టే. అప్పుడు తన అయిపూ అజా కనుక్కొనే వాళ్లుండరు..

టవున్లోకి రామి చేరుకొనేసరికి శ్రావణమేఘాలు దూదిపింజల్లా తేలిపోయాయి.

తూర్పుదిక్కు నిద్రమేల్కొని, కనురెప్పలు తుడుచుకుంది. తూర్పు రేకలు డ్యూటీ ప్రకారం విచ్చుకున్నాయి.

ఏలూరు బస్సుస్టాండులోకి వచ్చి, రామి ఎగశ్వాస తీర్చుకుంది. బస్‌స్టాండ్ పక్కన మూసివేసి వున్న పండ్ల దుకాణం బెంచీమీద కూర్చుంది రామి సేద తీర్చుకోవడానికి. అప్పుడే హైదరాబాద్ నుంచి నైట్ సర్వీసు బస్సొచ్చింది. అందులోంచి ఆడా, మగా, పిల్లాపీచూ

పెద్దబేడాతో, నిద్రలేని మొహాలతో దిగారు. వాళ్ళకేసి పరకాయించి చూసింది రామి. ఎరిగిన మొహం ఒక్కటీ లేక పోవడంతో, మనస్సు కుదుటబర్చుకుంది.

బస్‌స్టాండులో జనం అట్టే లేరు. భద్రాచలం వెళ్ళే బస్సులో జనం కూర్చున్నారు. సత్తుపల్లి వెళ్ళే బస్సు అప్పుడే వొచ్చి ఆగింది. డ్రైవరు దిగి కాఫీ తాగడానికి బస్‌స్టాండు ఎదురుగా వున్న శ్రీరామా విలాస్ కాఫీక్లబ్‌కు వెళ్లాడు, కండక్టర్‌తోపాటు. ఆ రాత్రి తాను చూసిన 'కిరాయి ఆడది' సినిమాగురించి కండక్టరు డ్రైవరుతో మహా గొప్పగా చెబుతున్నాడు. రాత్రి డ్యూటీ దిగాక జల్లేరు బ్రిడ్జి దగ్గర లారీడ్రైవర్లతో ఆడిన మూడుముక్కలాటలో పోయిన ముప్పై రూపాయల్ని గురించి దిగులుతో ఆలోచిస్తూ, ఆ మాటలేవీ వినడంలేదు డ్రైవరు.

అయిదు నిమిషాల తర్వాత తాడేపల్లిగూడెం వెళ్లే బస్సు లైన్‌లో ఆగింది.

రామి తెగ ఆలోచిస్తోంది- ఏ బస్సు ఎక్కాలా అని. సామానేమీ లేదు. చివరకు చేతిలో చిన్న సంచీకూడా లేదు. బొడ్లో మూడొందల రూపాయలదాకా చిన్నా పెద్దా నోట్లున్నాయి. ఏ బస్సయినా ఎక్కొచ్చు. ఎక్కడికైనా పోవచ్చు. ఏ వూరు వెళ్ళాలా? అనేదే తేల్చుకోలేకుండా వుంది.

బస్‌స్టాండ్‌లో క్రమేపీ ప్రయాణీకులు ఎక్కువయ్యారు: నడిచి కొంత మందీ, రిక్షాల్లో మరికొంతమందీ, రెండెడ్ల బళ్లల్లో ఇంకొంతమందీ చేరుతున్నారు. జనం ఎక్కువమంది గుమికూడకముందే తను బస్సెక్కాలి. గురవాయి గూడెం నుంచి ఎవరొచ్చినా తనని గుర్తుపడతారు.

"ఇంత పొద్దుగాలే ఇదెక్కడికి కెళుతోందిరా!" అనుకుంటారు. అవసరమొస్తే "వెంకటి పెళ్లాం రామిని సూరేడు పొడవకముందే జంగారెడ్డిగూడెం జంక్షన్‌లో చూశాం" అని చెప్పినా చెప్పొచ్చు. ఏందుకొచ్చిన లాయలెస్సా? పసిమంది కంటా పడకముందే ఏదో ఒక బస్సెక్కితే.... అదే ఏ బస్సెక్కాలా అని!

రామి ఒంటరిగా అక్కడ కూర్చోవడం, బెదురు గొడ్డులా చూస్తూ వుండటాన్ని ఇద్దరు ముగ్గురు గమనించారు. గొడుగు చంకన బెట్టుకొని, గోదుమ రంగు ముతక ఖాదీషర్టూ, తెల్లటి ధోవతీ ధరించి, వలపు పులుపు చావని ఓ యాభై అయిదేళ్ళ లావుపాటి, బుర్రమీసాల వ్యక్తి ఆమెను తేరిపారజూస్తూ రెండుసార్లు అటూఇటూ తిరిగాడు. తుమ్మచెట్టు రంగు టెర్రీకాట్ ప్యాంట్‌పైన, మబ్బు రంగు సాదాస్లాక్ వేసి, ఆఫీసులో చేసిన తప్పుడు పనికి రెండేళ్ళనుంచీ ఇంక్రిమెంట్ ఆగిపోయిన ఓ ఎల్డీసీ, రాత్రంతా టవున్‌హాల్ క్లబ్బులో పదీ ఇరవై పైసల పేకాటాడి తాడేపల్లిగూడెం పోవాల్సి బస్సుస్టాండ్‌కొచ్చి, ఒంటరి ఆడదాన్ని చూసి, ఓచూపు చూసిపోదామని అటుగా వచ్చాడు.

రామి మంచి చూపరి. గురవాయిగూడెం మొత్తానికి అందగత్తె. ఇరవై నాలుగేళ్లదాకా వయస్సువున్నా, నిన్ననో, మొన్ననో శోభనమైనట్టు బిగుతుగా, బింకంగా, పొంకంగా, పిటపిటలాడుతూ వుంటుంది. జయప్రద ముక్కు, జయసుధ బుగ్గలూ, జయమాలిని రొమ్ముకట్టు, సిల్క్‌స్మిత కళ్లూ, శ్రీదేవి ఎత్తూ-ఆమె పొందుకోసం మూడెకరాల జొన్నచేను అమ్మేశాడు గురవాయిగూడెం మున్సబు కొడుకు. ఆమెతో అరగడియ భోగం కోసం పెళ్లాం మూడుజతల రాళ్ల గాజులు పోకడ పెట్టాడు అవూరి షావుకారి గారాల మూడో పుత్రుడు. ఇట్లా పదెకరాల పైచిలుకు పొలంగల రసికులంతా ముక్కుపుడక దగ్గర్నుంచీ గద్వాల పట్టుచీరదాకా ముడుపు చెల్లించుకొని ఆమెతో 'ఒక్కసారి' అనుభవం కోసం అలమటించి పోయినవాళ్లే. అయితే రామి సింపుల్‌గా వుంటుంది. నేత చీరలు తప్ప మరోటి కట్టదు. నీరుదిగిన నీలం ముక్కుపుడక, మొగుడున్నట్టు గుర్తుగా మెడలో ఒంటిపేట నల్లపూసల గొలుసూ ఒక్కొక్కచేతికి నాలుగేసి మట్టిగాజులూ తప్ప ధరించదు. నగలూ, నోట్లూ, ఖరీదైన చీరలూ ఎప్పటికప్పుడు కొయ్యలగూడెం పంపి, పుట్టింట్లో దాస్తుందని అగుబ్బుగా చెప్పుకుంటారు వూళ్లోవాళ్లు.

తన గమ్యం ఎక్కడికో! ఇంకా రామి తేల్చుకోలేదు. ఆలోచిస్తూనే వుంది చకచకా.

సూర్యుడు కరకరా పైకెక్కుతున్నాడు.

ఎండ తెల్లదనాన్ని పుంజుకుంటోంది.

అదే సమయంలో పెరల్ గ్రే కలర్ ఎంబాసిడర్ కారొచ్చి ఆమెకు అరుగజాల దూరంలో ఆగింది. డ్రైవరు దిగి భద్రాచలం బస్సు దగ్గర కెళ్లాడు ఎవరికోసమో. కారులో వెనకసీట్లో ఓ వ్యక్తి కూర్చున్నాడు. అతను రామికేసి 'ఏదో పోగొట్టుకుంది ఇన్నాళ్ల తర్వాత దొరికినట్టు, యమ ఆత్రంగా చూశాడు అద్దం సాంతం దించిన డోర్‌లోంచి.

రామికూడా అతనికేసి చూసింది. ఆ చూపులో ఏనాటిదో అనుబంధ శకలం వున్నట్టు గోచరించింది ఆ వ్యక్తికి. వెంటనే డోర్ తెర్చుకుని కిందకి దిగాడు. ఆరడుగుల ఆజాను బాహువుడు. వెడల్పయిన భుజాలు, ఎత్తయిన ఎదురొమ్ము, కోచేరులా కొనదేలిన ముక్కుతో డైమండ్ రింగ్ ఆకారంలో వున్న మొహం, పండిన చక్కరకేళీ శరీరఛాయ, ఏనుగు చెవులు, దొడ్డు పెదాలు, బుగ్గమీద కత్తిదెబ్బ తగిలి మానిన గాయపు మచ్చ, ఇరుకైన

మదురు మీద నల్లని వొత్తయిన జుట్టు, చెంపల కిందికి దిగిన పట్టీలు! తెల్లటి మైసూరు సిల్కు షర్టుపై అంతకంటే తెల్లని గ్లాస్కో పంచెను లుంగీగా ధరించాడు. అతనికేసి చూసిన ప్రథమ వీక్షణంలోనే 'పదహారణాల పురుషుడు' అనుకొంది రామి.

'ఇదెక్కడో పారిపోయి వచ్చిన పిట్టలా వుంది. ఆశ్రయమిచ్చి, అనుభవిస్తే పోలేదూ!, అనుకొన్నాడు శంకరరాజు.

ఆమె ముందుగా మూడుసార్లు పచార్లు చేశాడు. ఏ క్షణమూ చూపును ఆమెనుంచి మరల్చలేదు! అతని చూపులకు ఆమె గాలికి అరటాకులా బెదిరిపోలేదు. చూపులో చూపు నిలిపింది. చిరునవ్వు కూడా విసిరింది కొరడాలా- దూరంగా అరటితొక్క కోసం మేకను తరుముతూన్న కుక్కను చూస్తున్నట్టు నటించి, అభిసారిక ఆహ్వానానికి ఆ చిరునవ్వుకంటే మరింకేం కావాలి? అనుకున్నాడు శంకరరాజు వుంగరాల చేతితో నొక్కుల జుట్టును సర్దుకుంటూ.

అంతలో డ్రైవరు వచ్చాడు.

"సార్! భద్రాచలం బస్సులో వీర్రాజుగారు లేరండీ."

"సర్లే" అంటూ కారు వెనకసీట్లో కూర్చున్నాడు శంకరరాజు. డ్రైవింగ్ సీట్లో కూర్చోబోతున్న డ్రైవర్ను పిల్చాడు. వాడి చెవిలో ఏదో చెప్పాడు! ఆపళంగా డ్రైవరు రామి దగ్గరకెళ్లాడు.

"మా అయ్యగారు మిమ్మల్ని రమ్మంటున్నారండీ" అన్నాడు డ్రైవరు రామితో.

రామి గతుక్కుమంది.

కనురెప్పలు అల్లల్లాడించింది.

చివుక్కున కుడీ, ఎడమకు చూసింది.

వెంటనే వెళ్ళి కారు వెనక సీట్లో కూర్చుంది.

వెనక సీట్లోవి కారు నల్లద్దాలు




పైకెత్తాడు శంకరరాజు.

కారు బయల్దేరింది.

చింతచెట్ల తోపులోంచి ఉదయపు సూర్యుడు కారు నల్లద్దంలోంచి వెలవెలా కనిపిస్తున్నాడు.

"ఏవూరు మందీ?"

చెప్పింది రామి.

"మొగుడేం చేస్తాడు?"

చెప్పింది రామి.

"ఇంటి దగ్గర్నుంచేనా రావడం!"

అవునంది రామి.

"ఎక్కడికెళ్లాలని?"

"సీరెక్కడకు తీసుకెళ్ళితే అక్కడికి"

బాణం మార్కు మీసకట్టుగల శంకరావు మొహం మెర్క్యురీ దీపంలా వెలిగింది. అమాంతంగా కుడిచెయ్యి ఆమె భుజంమీద వేసి నొక్కాడు. డన్ లప్ పిల్లోను నొక్కిన 'ఫీలింగ్' కలిగింది.

అంతలో రోడ్డుమీద సీమపంది అడ్డురాగా సడన్ బ్రేక్ వేశాడు డ్రైవరు. ఆమె ముందుకు వొంగింది. ఆ వొంగడంలో పైట జారి సీటుకింద మానుకాయ రంగు వెల్వెట్ తివాచీ పైన పడింది.

ఫోర్త్ గేర్ నుంచి మళ్ళీ ఫస్ట్‌గేర్ వేసే హడావిడిలో వున్నాడు డ్రైవరు.

పైటను అందుకోవడానికి ఆమె సాంతం వొంగింది. 'బ్రా' లేని జాకెట్టులోంచి తొంగిచూసిన ఆమె సూపర్ సైజు రొమ్ముల సోయగం శంకరరాజు మగసిరిపైన ఛాలెంజీ ప్రకటించినట్లయింది. మత్తుగా, మోహాతి మోహంగా చిరునవ్వు నవ్వుతూ పైటచెంగు పైకి లాక్కుంది రామి.

కారు హైదరాబాద్ రోడ్డు పట్టింది.

కారులో తనని గురించి చెప్పింది రామి.

ఆమె మొగుడు ఒఠ్ఠి పల్లెటూరిబైతు. ముప్పొద్దులా గరువుమీద పనిచేసుకొనేవాడు. తాను కొయ్యలగూడెం స్కూల్లో ఆరో తరగతిదాకా చదువుకుంది. మొగుడికి చదువు బొత్తిగా రాదు. తనకి ఆ పెళ్ళి సుతరామూ ఇష్టంలేదు. కాని తండ్రి బలవంతాన చేశాడు-తనకి బాగా వూహ రాకముందు. ఏం చేస్తుంది? తలిదండ్రుల మర్యాద కాపాడటానికి, గూడెంవాళ్ల పరువు నిలబెట్టటానికి కాపురాని కెళ్ళింది గురవాయిగూడెం. అది పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. అక్కడి మనుషులంతా అనాగరికులు. వాళ్ల వంటి పనిచేసుకోవడం మినహా మరో విద్య

తెలీదు. పగలంతా గరువునేలమీద కష్ట పడతారు. పొద్దుగూకాక ఓ ముంత కల్లు దాగి చక్కా నిద్రబోతారు. ఆయనకూడా అంతే! మగాళ్లూ, ఆడాళ్ళూ, పిల్లాపీచూ అంతా పొలంమీద పొద్దస్తమానమూ పడి కాయకష్టం చేయాల్సిందే! చివరకు చేతికొచ్చే పంట హాళ్ళకి హాళ్ళ సున్నకు సున్న! అవ్వాళ్లో తనకు ఏమాత్రం ఉండ బుద్ధి పుట్టేదికాదు. వారానికి రెండుమూడు సార్లన్నా జంగారెడ్డిగూడెం వొచ్చేది. సినిమాలన్నా, సినిమా పాటలన్నా తనకు మహా పిచ్చి. తనట్లా మాటిమాటికీ జంగారెడ్డిగూడెం రావటం ఆయనకు ఇష్టం లేదు. ఆయనకే కాదు చుట్టుపక్కల ఇళ్ల వాళ్లక్కూడా ఇష్టంగా ఉండేదికాదు. తనమీద లేనిపోనివి ఏవో కల్పించి చెప్పేవాళ్లు. చెడుతిరుగుళ్లు తిరుగుతూన్న దని కూడా చెప్పారు. దానితో ఓరోజు తనని చింతబెరికతో చావచితక కొట్టాడు. భరించింది. నెలరోజులపాటు ఇల్లు కదల్లేదు. పొలానికొచ్చి పని చేయమన్నాడు. ససేమిరా తను చేయనంది. తను అంతో యింతో చదువుకున్నది. చక్కగా మాట్లాడేది. నాగరికత నేర్చుకుంది. పొలాల్లో పనిచేసే అలవాటు చిన్నప్పట్నుంచే లేదు. తనచేత పొలంలో పని చేయించాలని ఆయన మహా పట్టుదలగా వున్నాడు. తను అతనికంటే పదిరెట్లు మొండిది. దానితో ఇద్దరికీ దెబ్బలాట జరిగేది. తనని లొంగదీసుకోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఒకరోజు తనని పుట్టింటికి వెళ్ళమన్నాడు. అట్లాగే వెళ్లింది. పదిహేను రోజుల తర్వాత ఆయనే వచ్చాడు కాళ్ళబేరానికి. పొలంలో పనిచేయనక్కర్లేదనీ, సినిమా పాటలకు రేడియో కొనిపెడతాననీ, నెలకోసారి జంగారెడ్డిగూడెం వెళ్ళి సినిమా చూడొచ్చనీ చెప్పి, బ్రతిమిలాడి మళ్ళీ తీసుకెళ్లాడు. తను వెళ్ళింది. కట్టుకున్న మొగుడు కాళ్లబేరానికొస్తే, కాలదన్నితే ఏం సబబుగా వుంటుంది. మూణ్ణెళ్లపాటు బాగానే వున్నాడు. అంతలో ఆయన తల్లో మళ్లీ పురుగు తొలచింది. మళ్లీ ఆంక్షలు విధించాడు. గడప దాటకూడదన్నాడు. గడప దాటితే మళ్లీ గడప తొక్కనివ్వనన్నాడు. గడప తొక్కితే కాళ్లు గొడ్డుకత్తితో నరికేస్తానన్నాడు. తనకు కోపం వచ్చింది, బానిస బతుకు మీద భయం వేసింది. ఇల్లు బయలుదేరి వచ్చేసింది. తీలా వచ్చాక ఆలోచించింది! తప్పుపని చేస్తోందా! అని. కాని వెనక్కు వెళ్లడానికి వీల్లేదు, వెళితే కాళ్లు తెగిపోతాయి. అందుకే తెగించి, ఎటైనా పోవడానికి జంగారెడ్డిగూడెం బస్సుస్టాండుకొచ్చింది. ఇష్టంలేని మొగుడితో కాపురం చేయడం కంటే, అష్టకష్టాలపాలైనా పడి స్వేచ్ఛగా బ్రతకడం మేలు.

ఖమ్మం, సూర్యాపేట మీదుగా కారు పదకొండు గంటలకు హైదరాబాద్ చేరింది.

“నీకేం ఫర్వాలేదు రామీ! నేనున్నాను. నీకు అరచేతిలో స్వర్గం చూపెడతాను. నా దగ్గరే వుండిపోదువుగాని స్టెపినీలా. ఓ ఇల్లు చూసి హైదరాబాద్‌లానే వుంచుతాను.” అని ధైర్యం చెప్పాడు శంకర్రాజు.

రామి ఉబ్బిపోతూ, ఉత్సాహంగా తలాడించింది.

నాంపల్లిలో ఓ మారుమూల వీధిలో ఓ లాడ్జింగ్‌లో దించాడు రామిని శంకర్రాజు టెంపరరీగా. ఆ లాడ్జి ప్రొప్రైటర్ సుబ్రహ్మణ్యం అతనికి బాగా తెల్సు. అప్పుడప్పుడూ శంకర్రాజు పరాయి ఆడవాళ్లను అక్కడకు తీసుకొస్తూ వుంటాడు. రూమ్‌లో ఒకటి రెండ్రోజులు వుంచుకొని అవసరం తీరాక పంపించడం అలవాటు.

“కొత్త సరుకులాగా వుంది” అన్నాడు సుబ్రహ్మణ్యం.

“అవును జాగ్రత్తగా చూసుకోవాలి” అన్నాడు శంకర్రాజు ముసిముసి నవ్వులు నవ్వుతూ.

మధ్యాహ్నం రెండు గంటలదాకా రామితో రూమ్‌లో వుండి, ఆ తర్వాత పని వుందనీ, సాయంత్రం అయిదింటికి వస్తాననీ చెప్పి ఎంబాసిడర్ కారులో వెళ్లాడు శంకర్రాజు.

ఠంచన్‌గా సాయంత్రం అయిదు గంటలకు శంకర్రాజు కారులో ఆలాడ్జికి వచ్చాడు రామి కోసం. అతను కారు దిగుతూండగానే రిసెప్షన్ నుంచి ఎస్స్. ఐ., ముగ్గురు పోలీసుల మధ్యగా నడిచి వస్తోంది రామి.

శంకర్రాజు దిగ్భ్రమచెంది కారు దిగడం మానివేశాడు. అది గ్రహించిన పోలీసుల మధ్యనున్న రామిని కళ్లారా చూసిన డ్రైవరు కార్ను వెంటనే స్టార్టు చేసి, దూరంగా ఓ గల్లీలోకి పోనిచ్చాడు. అక్కడో మెడికల్ షాపునుంచి లాడ్జింగ్‌కు ఫోన్‌చేశాడు శంకర్రాజు తడబడే గొంతుతో.

“కొంప మునిగే సరుకును పట్టుకొచ్చారు! ఆమె మొగుడ్ని మర్డర్ చేసిందట. జంగారెడ్డిగూడెం జంక్షన్ నుంచి పోలీసులకు సమాచారం వొచ్చిందట— తెల్లటిఅంబాసిడర్ కారులో ఎక్కి వచ్చినట్టు. ఆమె లాడ్జింగ్‌కు ఎట్లా వచ్చిందీ, ఎవరు తీసుకొచ్చిందీ వివరాలేమీ పోలీసులకు చెప్పలేదు....” అన్నాడు సుబ్రహ్మణ్యం వాణికే గొంతుతో.